క్లుప్తంగా

ఘనంగా దుర్గమ్మ బోనాలు



వర్ధన్నపేట : పట్టణంలో గురువారం ఘనంగా దుర్గాదేవి బోనాలు నిర్వహించారు. మాజీ కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల సంస్థ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లేశంను నిర్వాహకులు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో నాయకులు సిలువేరు కుమారస్వామి, బొంత రవి, కరిమిళ్ల సంపత్ రావు, బొంత కాంతం, కరుణాకర్, బక్కతట్ల రాజు, బొంత యాకాంబరం, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



నెక్కొండ : మండల కేంద్రంలో భారతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రాలతో ముద్రించిన ఫ్లెక్సీకి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళా శక్తిలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చిందని చెప్పారు. మండల సమాఖ్యకు బస్సు కొనుగోలు కోసం రూ.30 లక్షలు మంజూరీకి ఎమ్మెల్యే మాధవరెడ్డి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, సీసీ రవీందర్, మహిళా సంఘాల ప్రతినిధులు రాపాక యమున, రాధిక, స్రవంతి, సరళ, విజయ, ప్రసన్న, మంజుల, దివ్య, వీఓఏలు అరుణ, శ్రీలేఖ, వెంకటరమణ, సతీశ్, ఏకాంబ్రం, స్వామి, సూర్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లి శివారులోని బోడతండాకు చెందిన బోడ మోహన్‌కు మంజూరైన రూ.40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి గురువారం అందజేశారు. అనంతరం వీరారెడ్డి మాట్లాడారు. మోహన్ అనారోగ్యం బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ బాలునాయక్, నాయకులు చిలుపూరి వీరస్వామి, జరుపుల ప్రవీణ్, జక్క రవి, అంబాల రంజిత్‌కుమార్, బోడ కిషన్, జరుపుల సక్రు, బండి అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

పర్వతగిరి : తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని గుడి తండాకు చెందిన భూక్య రంగమ్మ (65)ను ఆమె కుమారుడు రవి గత నెల 28న తీవ్రంగా కొట్టి గాయపర్చాడు. కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. మృతురాలి చిన్న కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని బమ్మెరకు చెందిన రాజు తన బంధువుల ఇంటికి వచ్చి వర్ధన్నపేటకు నడుచుకుంటూ వెళ్తుండగా వర్ధన్నపేట నుంచి బొంత రవి అనే వ్యక్తి నడుపుతున్న బైక్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన రాజును 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

తండాలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై హర్షం

రాయపర్తి : మండలంలోని ఏకేతండాలో విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. తండాలో నిత్యం కరెంట్ సమస్యలుండడంతో దోమలతో సతమతమయ్యే పరిస్థితి ఉండేదని, 4 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైందని తండావాసులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును గ్రామస్తులు రమేష్‌నాయక్, హలావత్ సోమనాయక్, మూనావత్ మోహన్, రామావత్ నర్సింహా, హలావత్ భాస్కర్, మూనావత్ శ్రీనివాస్, మూనావత్ కాళీ, మూనావత్ పొట్టి, రవినాయక్ తదితరులు పర్యవేక్షించారు.

పొగాకు సాగుకు ఆదరణ

● పంటల మార్పిడికి రైతుల ఆసక్తి

సంగెం : మండలంలో సాధారణంగా పత్తి, మొక్కజొన్న, వరి ఎక్కువగా పండించడం పరిపాటి. ఏళ్ల తరబడి ఒకే రకమైన పంటల సాగుకు రైతులు అలవాటు పడిపోయారు. ఈ క్రమంలో భూసారం దెబ్బతినడంతోపాటుగా దిగుబడి తగ్గుతుండడంతో పంటల మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ శాఖ అధికారులు కొంత కాలంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రామచంద్రాపురం గ్రామ రైతులు పంటల సాగులో మార్పు దిశగా ఆసక్తి చూపుతున్నారు. గ్రామంలో తొలుత రెండెకరాల పొగాకు సాగుతో పంటల మార్పిడి మొదలవగా కాలక్రమంలో 50, తదనంతరం 75 ఎకరాల్లో సాగుకు విస్తరించింది. ఈ క్రమంలో అధిక లాభాలు వస్తుండడంతో రైతులు ఈ ఏడాది ఏకంగా 210 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారు. గతంలో ఇక్కడి రైతులు ఎక్కువగా పత్తి సాగు చేసిన క్రమంలో తెగుళ్లు, గులాబీ పురుగు ఆశించడంతో దిగుబడి తగ్గుతూ వచ్చింది. దీంతో పొగాకు సాగు దిశగా మొగ్గు చూపిస్తున్నారు.

చీడపీడలు తక్కువ...

నీటి వసతి తక్కువగా ఉన్న భూములు పొగాకు సాగుకు అనుకూలంగా ఉంటుండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. పొగాకు పంటలో కలుపు, తెగుళ్ల బెడద కూడా తక్కువగా ఉంటోంది. లద్దె పురుగు, తేనే మంచు మాత్రమే ఆశిస్తుండగా నివారణకు లామ్డాసైలోత్రిన్, ఇమిడాక్లోప్రిడ్ మందును ఎకరాకు 120 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే సరిపోతోంది. లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 60 ఎంఎల్ పిచికారీ చేయాలి. పొగాకు పంటకు పశువులు, కోతులు, అడవి పందుల బెడద ఉండదు.

ధర బాగా తగ్గింది

రెండేళ్లపాటు పొగాకు పంట వేస్తే మంచి దిగుబడితోపాటుగా ధర క్వింటాల్‌కు రూ.15 వేల వరకు పలికింది. ఈ ఏడాది క్వింటాకు కేవలం రూ.7 వేలే పలుకుతోంది. పెట్టుబడులు పెరిగాయి. కనీసం క్వింటాకు రూ.12 వేలపైనే లభించాలి. ఒక్కసారిగా ధర భారీగా తగ్గడంతో పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

\- దౌలత్‌బాజీ శ్రీనివాస్, రైతు

స్వాగతించాల్సిన అంశం

అనేక ఏళ్లపాటు రకమైన పంట సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గుతుంది. పంటల మార్పిడికి రైతులు ముందుకు రావాలి. రామచంద్రాపురంలో సుమారు 170 మంది రైతులు 210 ఎకరాల వరకు పొగాకు సాగు చేశారు. ఇది స్వాగతించాల్సి అంశం. దీనికి తెగుళ్ల ఆశించవు. నీటి తడులు కూడా తక్కువగా అవసరం.

\- సాగర్, ఏఈఓ, గవిచర్ల క్లస్టర్



రామచంద్రాపురంలో పొగాకు పంట



తోరణాలుగా ఆరబెట్టిన పొగాకు

ఆరబెట్టే విధానం

పొగాకు పంట వేసిన ఐదు నెలలకు దిగుబడి చేతికొస్తుంది. ఆకులు తెంపి సోలార్ కవర్ కింద 8-10 రోజుల ఆరబెట్టాలి. లేదా తోరణాలుగా చేసి 20-25 రోజుల వరకు ఎండబెట్టాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే సమయంలో బేల్లుగా తయారు చేసి తేమ శాతం ఎక్కువ లేకుండా చూడాలి. జనగామ జిల్లాలో పొగాకు మార్కెట్ ఉన్నప్పటికీ ఆశించిన మేరకు ధర లభించకపోతుండడంతో రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు వెళ్లాల్సి వస్తోంది. కాగా గతేడాది క్వింటాకు రూ.15 వేల ధర పలుకగా ఈ ఏడాది కేవలం రూ.7 వేలు పలుకుతుండడంతో రైతులు కొంత ఆందోళనలకు గురవుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

● మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి

రాయపర్తి : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లి, గన్నారం, కిష్టాపురం, కొండూరు, కాట్రపల్లి, జింకురాం తండా, మొరిపిరాల, మైలారం గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి కృష్ణారెడ్డి గురువారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని సరైన ధర పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయించొద్దని కోరారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, ఏఓ వీరభద్రం, ఎంపీఓ కూచన ప్రకాశ్, ఏపీఎం కిరణ్‌కుమార్, నాయకులు రెంటాల గోవర్ధన్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, వనజారాణి, పెండ్లి మహేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, కోటేశ్వర్, చెట్టె ఎల్లేశ్, జనగాం యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు పునాది

● ఎస్సై వెంకటేశ్వర్లు

దుగ్గొండి : విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు పునాది పడుతుందని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. స్కూల్ ఆవరణను, పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని చెప్పారు. తల్లిదండ్రులు గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. వేసవిలో చెరువులు, బావుల వద్దకు ఈతకొట్టేందుకు వెళ్లొద్దన్నారు. తీరిక సమయాల్లో తల్లిదండ్రులకు ఇంటి, వ్యవసాయ పనుల్లో తోడ్పాటు అందించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని చెప్పారు. మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండడంతోపాటు సెల్‌ఫోన్‌ను అవసరం మేరకే వినిగించాలని, ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామస్వామి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్సై

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

● 'యంగ్ వన్' హెచ్‌ఆర్ మేనేజర్ సుచిత్ర

సంగెం : కుట్టు శిక్షణతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని యంగ్ వన్ సంస్థలో మహిళలకు ఉపాధి లభిస్తుందని ఆ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ సుచిత్ర తెలిపారు. మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ పార్కు నిర్వాసిత కుటుంబాల మహిళలకు ఏర్పాటు చేసిన రెండో బ్యాచ్ కుట్టు శిక్షణ తరగతులను ఆమె గురువారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. మరో రెండు, మూడు నెలల్లో భారీగా రిక్రూట్‌మెంట్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్నె కల్యాణి, ట్రెయినర్ హేమలత, ఏపీఎం కిషన్, సీసీలు సురేశ్, కుమారస్వామి, రాజయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుచిత్ర

స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

నర్సంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ ఉమారాణికి గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం యువరాజు మాట్లాడారు. ప్రభుత్వం స్వీపర్లకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. 9 నెలలు గడచినా వేతనాలు చెల్లించకుండా కార్మికుల పట్ల వివక్ష చూపుతోందంటూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ప్రభుత్వ మోసపూరిత విధానాలతో స్వీపర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మరో వారం రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వనున్న క్రమంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కొల్లూరి లక్ష్మినారాయణ, గౌర్రె విజయ, రమాదేవి, లక్ష్మి, మౌనిక, రజిత, అనిత, తదితరులున్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సీఐటీయూ ఆధ్వర్యంలో..

గ్రామపంచాయతీ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించడంతోపాటు కారోబార్, సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరుతూ సీఐటీయూ చెన్నారావుపేట మండల కన్వీనర్ జన్ను రమేశ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు దూడయ్య, రాజు, నాయకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పోరాడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

పర్వతగిరి : రాజ్యాంగ పరిరక్షణకు పోరాడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కో ఆర్డినేటర్ సంతోశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జై భీం, జై బాపు, జై సంవిధాన్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, దేవేందర్‌రావు, సంతోశ్, అనిల్‌రావు మాట్లాడారు. భవిష్యత్ తరాలకు రాజ్యాంగం కీలకమన్నారు. రాజ్యాంగాన్ని మార్చే దిశగా కొన్ని పార్టీలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రతన్‌రావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బందెల వెంకన్న, నాయకులు కత్తుల వెంకన్న, సావిత్రమ్మ, మాలోతు బావుసింగ్, భాను, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'మా భూమి' రథయాత్రను జయప్రదం చేయాలి

ఆత్మకూరు : ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రాంగణంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టనున్న లక్ష కిలోమీటర్ల 'మా భూమి' రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మైదం రవి కోరారు. మండల కేంద్రంలో గురువారం రథయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ చైతన్యాన్ని అందిస్తూ రాజ్యాధికార సాధనే లక్ష్యంగా చేపట్టనున్న రథయాత్రకు కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు.

'అసత్య ప్రచారం సరికాదు'



నల్లబెల్లి : కొండాపూర్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించిన సందర్భంలో బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేయడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ ఉనికిని చాటుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బాష్‌సింగ్, ఉపాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



గీసుకొండ : ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహించనున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర మహాసభల కరపత్రాలను తోటి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు గ్రేటర్ వరంగల్ పరిధిలోని జాన్‌పాకలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహాసభలకు ఆదివాసీ కోయ కులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ సిద్దబోయిన లక్ష్మీనారాయణ, కో-కన్వీనర్ సోయం రాజేందర్, నాయకులు సోయం సాంబయ్య, సదానందం, శరత్‌బాబు, రవి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

'గ్యాస్ ధర పెంపు దుర్మార్గం'



నర్సంపేట : వంట గ్యాస్, చమురు ధరల పెంపు దుర్మార్గమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని నెక్కొండ రోడ్డులో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపై భారాలు మోపడం, సంపన్నులకు రాయితీలివ్వడం పరిపాటిగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించకపోగా పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచేలా వంట గ్యాస్, చమురు ధరలు పెంచడం సరికాదన్నారు. కేంద్రంలోని బీజేపీ మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు లాలూ, ధార లింగన్న, స్వరూప, సులోచన, రమ, రాజేందర్, మనోహర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కూలీలకు వేతనాలు కరువు'

నర్సంపేట : ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు రెండు నెలలుగా వేతనాలు కరువయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించి సమస్యలను అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు. చట్టం ప్రకారం వారం రోజులకు ఓసారి వేతనాలు చెల్లించాల్సి ఉన్నా రెండు నెలలుగా ఇవ్వడం లేదన్నారు. అలాగే పని ప్రదేశాల్లో తాగునీటి, టెంట్, మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి హామీతో సంబంధం లేకుండా భూమిలేని పేదలందరికీ ఏటా రూ.12 వేల చొప్పున భృతి చెల్లించాలని, ఉపాధి హామీ పనులను అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్‌రెడ్డి, యాదమ్మ, విజయ, బాబు, స్వరూప, విజయ, యాకాంబరం పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ

నర్సంపేట : పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పోషక ఆహారం, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. తొలుత చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మునుకుంట్ల రాధిక, సంధ్యారాణి, సుజాత, భారతి, ఆశా కార్యకర్తలు రవి, రాజు, శైలజ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోతి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోతే గర్భంలో శిశువు బలహీనంగా జన్మించే ప్రమాదం ఉంటుందన్నారు. తొలుత పలువురు గర్భిణులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంబాబు

గీసుకొండ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు కోరారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని ధర్మారంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'గావ్ చలో.. బస్తీ చలో' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే దిశగా అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ కమిటీ అధ్యక్షురాలు జాలిగపు ప్రసన్న రాంప్రసాద్, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతికుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గోదాసి అశ్విని, డివిజన్ ఇన్‌చార్జ్ కొంగర రవికుమార్, కన్వీనర్ బైకని వెంకటేశ్, నాయకులు ఆరె కుమారస్వామి, సుంకరి రాజు, ల్యాద రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

నాటుసారా తయారీ సామగ్రి పట్టివేత



నర్సంపేట రూరల్: పట్టుకున్న సామగ్రితో సిబ్బంది



సంగెం : గుడుంబా, బెల్లం పానంతో సిబ్బంది

నర్సంపేట రూరల్ : నాటుసారా తయారీకి వినియోగించే సామగ్రిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. నర్సంపేటలోని పాకాల్ రోడ్డులో ఉన్న సంతోషిమాత కిరాణంలో గురువారం తనిఖీ చేసి నాటుసారా తయారీదారులకు విక్రయించేందుకు ఉంచిన 250 కేజీల చక్కెర, 80 కేజీల బెల్లం, 20 కేజీల పటిక, 40 డ్రై ఈస్ట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వ్యాపారి మల్యాల మధుపై కేసు నమోదు చేసి తహసీల్దార్ రాజేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకం, ముడిపదార్థాల విక్రయానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో..

సంగెం : మండలంలోని రేఖ్యానాయక్‌తండా, గట్టుకింద తండా పరిసరాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 10 లీటర్ల గుడుంబాతోపాటు 700 లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఆ శాఖ సీఐ స్వరూప మీడియాకు వెల్లడించారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి ఏడుగురిని తహసీల్దార్ రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఆ శాఖ ఎస్సైలు సరిత, బి.శిరీషరెడ్డి, కానిస్టేబుళ్లు రమేశ్‌బాబు, సురేశ్, వెంకన్న, అనిల్, వంశీ, మానస, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని గరీబ్‌నగర్‌లో ఇల్లందుల రాకేశ్ నుంచి 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. అలాగే మచ్చాపూర్‌కు చెందిన పులిచేరి శ్రీలత, ఏరుకొండ కొమురెల్లి, ఏరుకొండ పద్మ, కోల ప్రశాంతి పలుమార్లు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా కేసులు నమోదు కావడంతో వారిని తహసీల్దార్ రియాజుద్దీన్ ఎదుట హాజరుపర్చగా రూ.లక్షకు బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

గూడూరు : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఇబ్బంది కలిగించొద్దని నిర్వాహకులకు డీపీఎం రాజు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని వసుంధర వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు అయోధ్యపురం, గాజులగట్టు, బొద్దుగొండ, నాయకపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులను పరిశీలించి రైతులు, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.